తెలుగు దినపత్రిక

సూర్యోదయ వార్త

ప్రతి అక్షరం ప్రజల కోసం...

తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ | సంపుటి: 2 | సంచిక : 46 | బుధవారం 11.11. 2026 | పేజీలు :4 | వెల: 2



ప్రజల విశ్వాసమే పోలీసుల అసలైన గౌరవం

నిజాయితీ, అంకితభావంతో విధులు నిర్వహించాలి

పోలీసు అధికారులుగా ప్రజల పట్ల బాధ్యతతో, పూర్తి నిజాయితీతో విధులు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్తగా నియమితులైన డీఎస్పీలకు సూచించారు. ప్రజల సమస్యలను ఓపికగా వినడం, అర్థం చేసుకోవడం ద్వారా వాటి పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని చెప్పారు. తమ హోదాను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించుకోవాలని, వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటే దీర్ఘకాలంలో గుర్తింపు ఉండదని స్పష్టం చేశారు. వచ్చే 30 ఏళ్ల తెలంగాణ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో పోలీసు అధికారుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో నూతనంగా నియమితులైన డీఎస్పీలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.

హైదరాబాద్ సూర్యోదయ వార్త

హోదాను వ్యక్తిగత ప్రయోజనాలకు వాడొద్దు

కొత్తగా నియమితులైన డీఎస్పీలకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణకు ఆధునిక వ్యవస్థలు

పారదర్శకతతో నియామకాలు

గత ప్రభుత్వ హయాంలో టీజీపీఎస్సీ నిర్వహణలో చోటుచేసుకున్న గందరగోళం నిరుద్యోగ యువతకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని సీఎం అన్నారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత టీజీపీఎస్సీని ప్రక్షాళన చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. యూపీఎస్సీ విధానాలను అధ్యయనం చేసి, పోటీ పరీక్షల నిర్వహణలో అనుభవం, చిత్తశుద్ధి కలిగిన వారిని బోర్డు సభ్యులుగా నియమించామన్నారు. తొలుత రిటైర్డ్ డీజీ మహేందర్ రెడ్డిని టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించామని, ప్రస్తుతం సీనియర్ ఐఏఎస్ అధికారి వెంకటేశంను ఆ బాధ్యతల్లో నియమించినట్లు వివరించారు. 563 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా 562 మంది విధుల్లో చేరారని, 112 మంది డీఎస్పీల నియామకం కూడా ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనమని పేర్కొన్నారు. నియామకాలపై కొందరు అవినీతి ఆరోపణలు చేసినప్పటికీ ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందన్నారు. డీఎస్పీల నియామకాల విషయంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయపోరాటం చేశామని, నిష్టాతులైన న్యాయవాదుల ద్వారా నియామకాలకు మార్గం సుగమం చేశామని తెలిపారు.

ప్రజల సమస్యలకు ప్రాధాన్యం

పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కొత్త అధికారులు నిలబెట్టుకోవాలని సీఎం సూచించారు. సమస్యతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులను గౌరవంగా కూర్చోబెట్టి, ప్రేమపూర్వకంగా మాట్లాడి వారి ఇబ్బందులను అర్థం చేసుకోవాలన్నారు. సమస్యను పూర్తిగా తెలుసుకున్నప్పుడే సమర్థవంతమైన పరిష్కారం చూపగలమని చెప్పారు. సమయం, వనరులు, సాంకేతిక పరిజ్ఞానం సమస్యల పరిష్కారంలో కీలకమని పేర్కొన్నారు. గతంలో అనేక మంది సీనియర్ పోలీసు అధికారులు నిక్కచ్చిగా విధులు నిర్వహించడం వల్లే పోలీసు వ్యవస్థకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు వచ్చిందని, దానిని కాపాడాల్సిన బాధ్యత కొత్త అధికారులపై ఉందన్నారు.

- మిగతా 2 లో..

రాహుల్ గాంధీ రీలాంచ్ కోసం తెలంగాణ ప్రజల సొమ్ము ఖర్చు చేస్తారా: రాంచందర్‌రావు

హైదరాబాద్ సూర్యోదయ వార్త



హైదరాబాద్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్'పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సదస్సు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని రాజకీయంగా రీ లాంచ్ చేసేందుకు చేస్తున్న మరో విఫల ప్రయత్నమని ఆయన ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ రాజకీయ భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రజల కష్టార్జితమైన ప్రభుత్వ ఖజానాను విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని తీవ్రంగా ఆరోపించారు. తెలంగాణ ఖజానా ఏమీ గాంధీ కుటుంబానికి పునరావాస నిధి కాదని, పార్టీ ప్రయోజనాల కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని రాంచందర్‌రావు విమర్శించారు. నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూస్తున్నారని, అటు రైతులకు సకాలంలో రైతుబంధు ఆర్థిక సాయం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం పక్కనపెట్టి, ప్రజాధనంతో రాజకీయ సదస్సులు నిర్వహించడం పై మండిపడ్డారు. తక్షణమే రాహుల్ గాంధీ వ్యక్తిగత ప్రచారం కోసం ప్రజాధనం వెచ్చించడాన్ని నిలిపివేసి, రైతులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కృష్ణా జలాల్లో తెలంగాణ న్యాయమైన వాటా సాధించాలి

- సుప్రీంకోర్టులో సమర్థంగా వాదనలు వినిపించాలి
- డిండి, అచ్చంపేట పనులు వేగవంతం చేయాలి
- నీటిపారుదల శాఖపై ముఖ్యమంత్రి సమీక్ష

2



ముచ్చింతల్‌లో జరిగిన విష్ణు సహస్రనామ పారాయణానికి గిన్నిస్ రికార్డ్

హైదరాబాద్ సూర్యోదయ వార్త



చ్చింతల్‌లోని శ్రీరామనగరంలో జరిగిన విష్ణు సహస్రనామ పారాయణానికి గిన్నిస్ రికార్డ్ దక్కింది. చినజీయర్ స్వామి పర్యవేక్షణలో ఈ పారాయణం జరగ్గా 5వేల మందికిపైగా భక్తులు పాల్గొనడంతో భారీ స్థాయిలో నిర్వహించినందుకు గానూ ఈ రికార్డు సొంతం చేసుకున్నారు. యతీంద్ర సప్తతి వేడుకల్లో భాగంగా విరాట్ పారాయణం నిర్వహించారు. గిన్నిస్ రికార్డ్ పై మైహోమ్ గ్రూప్ చైర్మన్ జూపల్లి రామేశ్వరరావు, చినజీయర్ స్వామి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ.. అపూర్వ ఘట్టానికి అంతర్జాతీయ రికార్డు దక్కిందని అన్నారు. ఎంతమంది చేశారన్నది కాదని, మనసుతో చేయాలన్నారు. ఎంతోమందికి ఈ కార్యక్రమం ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ఆర్మీలో ఆత్మస్థైర్యం నింపాలన్నదే తమ లక్ష్యం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో యువత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని చెప్పారు. మన దేశ యువతకు ప్రోత్సాహం అందిస్తే ఎన్నో విజయాలను సాధించగలరని చెప్పారు. అలాంటి యువతను కాక్రోచ్‌లు అని రకరకాల పేర్లు పెట్టి తప్పుదారిలో తీసుకువెళుతున్నారని చెప్పారు. యువతను అలా చేస్తున్నవాళ్లను మేధావులు అనాలో మధం ఎక్కినవాళ్లు అనాలో అర్థం కావట్లేదన్నారు. చీకటి పోవాలని, మేధాశక్తి వాళ్లలో రావాలన్నారు.

జీఎస్ఐటీఐలో మూడు కీలక సదుపాయాలు ప్రారంభం



- అంతర్జాతీయ వసతి గృహం, జియోఫిజికల్ ల్యాబ్, డిజిటల్ స్టూడియో అందుబాటులోకి..
- ఖనిజ అన్వేషణను వేగవంతం చేయాలి : కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి

2

బ్యాంకులు రైతులకు అండగా నిలవాలి



విద్యా, గృహ, ఎంఎస్ఎంఈ, మౌలిక సదుపాయాల రంగాలకు రుణాల పెంపునకు ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు బ్యాంకులు ప్రత్యేక చొరవ చూపాలి
- ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు రూ.50 లక్షల విరాళం

- పోలీసు కుటుంబాల పిల్లల విద్యాభివృద్ధికి ఆప్టిమస్ గ్రూప్ చైర్మన్ డి. శ్రీనివాసరెడ్డిచేయూత

అండాల సేకరణ అక్రమ దందాపై సర్కారు ఉక్కుపాదం



- 27 ఏఆర్టీ కేంద్రాల్లో తనిఖీలు
- ఏడు ఆసుపత్రుల్లో 13 ఉల్లంఘనలు గుర్తింపు
- 31 మంది మహిళలను గుర్తించి విచారణ
- యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు
- వైద్యులు, ఐవీఎఫ్ కేంద్రాలు, మధ్యవర్తుల పాత్రపై విచారణ



తెలంగాణ జెన్‌కోకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు

ఎల్‌నినో ప్రభావంతో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌కు ముందస్తు సన్నద్ధత

- యాదాద్రికి నైనీ నుంచి 16 వేల టన్నుల సరఫరా
- సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి

హైదరాబాద్ సూర్యోదయ వార్త

రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ అవసరాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, తెలంగాణ జెన్‌కో థర్మల్ విద్యుత్ కేంద్రాలకు రోజుకు 75 వేల టన్నుల బొగ్గు సరఫరా చేయాలని సింగరేణి నిర్ణయించింది. ఒడిశాలోని నైనీ బొగ్గు గని నుంచి యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి రోజుకు కనీసం 16 వేల టన్నుల బొగ్గు రవాణా జరిపేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ నుంచి సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, తెలంగాణ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్ అధ్యక్షతన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఉన్నతస్థాయి సమన్వయ సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆదేశాల

త్వరలో కరీంనగర్‌లో లక్ష మందితో 'మహా పాదయాత్ర'

హాజరు కానున్న బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్

- దేశవ్యాప్తంగా చర్చ జరిగేలా అంగరంగ వైభవంగా పాదయాత్రకు ఏర్పాట్లు
- సర్ పేరిట రాజ్యాంగ సంస్థలపై విపక్షాల కుట్రలను తిప్పికొట్టాల్సిందే..
- కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీతో కేంద్ర మంత్రి బండి సంజయ్ భేటీ
- జన సమీకరణ, మహాపాదయాత్ర ఏర్పాట్లపై చర్చ
- మండలాల వారీగా మీటింగ్ లు నిర్వహించాలని నేతలను కోరిన బండి సంజయ్



హైదరాబాద్ సూర్యోదయ వార్త

భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు నితిన్ నబిన్ అతి త్వరలో కరీంనగర్ కు రానున్నారు. 'సర్' పేరిట రాజ్యాంగ సంస్థలపై విపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు నిర్వహించే పాదయాత్రకు హాజరై ప్రసంగించనున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్ తొలిసారి కరీంనగర్ రానున్న నేపథ్యంలో కనీవినీ ఎరగని రీతిలో "మహా పాదయాత్ర'ను సక్సెస్ చేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్ణయించారు. అందులో భాగంగా కనీసం లక్ష మందితో కరీంనగర్‌లో "మహా పాదయాత్ర" చేసేందుకు సిద్ధమయ్యారు. గాంధీ సర్కిల్, వైశ్యా భవన్ నుండి టవర్ సర్కిల్ మీదుగా కమాన్ దాకా నిర్వహించే ఈ "మహా పాదయాత్ర"లో లక్ష మందితో కలిసి నితిన్

- మిగతా 2 లో..

జనవరిలో అల్వాల్ టిమ్స్ ప్రారంభం

బ్రాహ్మణపల్లిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..
- బండ జగన్మోహన్ రెడ్డి ములుగు జిల్లా ఆర్టిఐ చైర్మన్..
- మంగపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బాడిషా ఆదినారాయణ.



మంగపేట,నవంబర్ 10 ములుగు జిల్లా.(సూర్యోదయ వార్త)

ములుగు జిల్లా మంగపేట మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో మంగళవారం బండ జగన్ మోహన్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ,దేశంలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తెలిపారు. పేద,మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలుస్తూ,ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కంకణబద్ధమై పనిచేస్తోందని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి,అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు సున్నం ఆనందం, కాంగ్రెస్ పార్టీ నాయకులు సోయం ఈశ్వర్ రావు, కురసం శీను, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహిళా నాయకురాలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

గుమ్మడిదొడ్డి గ్రామంలో పారిశుద్ధ్య పనులకు శ్రీకారం!.

సర్పంచ్ భరత్ కుమార్, ఎంపీడీఓ ఆధ్వర్యంలో

మరుగుదొడ్లకు . ముగ్గు పోసి శంకుస్థాపన




వాజేడు, నవంబర్ 10 (సూర్యోదయ వార్త):

ములుగు జిల్లా వాజేడు మండలం గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం గ్రామ సర్పంచ్ బోదెబోయిన భరత్ కుమార్ – ఎంపీడీఓ కృపాకర్ ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని వివో బిల్డింగ్‌తో పాటు నూతనంగా ఏర్పాటు చేస్తున్న టాయిలెట్ల వద్ద ముగ్గు పోయించడం జరిగింది. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో , టి ఏ , పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు..

పదవ తరగతిలో లో ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలి..

- పదవ తరగతి లో అత్యుత్తమ ఫలితాల కోసం ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలి .
- తాడ్వాయి మండలం విద్యాశాఖ అధికారి. గడ్డి శ్రీనివాస్..





– ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని నార్లాపూర్ –కొడిసెల ఉన్నత పాఠశాలలోని హెడ్మాస్టర్స్ – ఉపాధ్యాయులతో సమన్వయ సమావేశం హెడ్మాస్టర్ ల ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ గడ్డి శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సంవత్సరం 2027 లో కూడా పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు. అలాగే చదువు లో చాలా వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి వాళ్లకు పాస్ అయ్యే విధంగా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అలాగే టాపర్స్ గా ఉన్న విద్యార్థులను గుర్తించి జిల్లా స్థాయిలో టాపర్స్ గా నిలచేందుకు కృషి చేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ నాగపూర్ ప్రధానోపాధ్యాయులు విద్యాసాగర్ – ఏ హెచ్ ఎస్ కోడిశాల హెచ్ఎం దేవా ఉపాధ్యాయులు శ్రీనివాస్. వెంకటేశ్వర్లు రాజు నరసింహ సి ఆర్ పి రవికుమార్ పాల్గొన్నారు

ప్రజల ప్రాణాలను బలికొంటున్న ఇసుక ర్యాంపులను ప్రభుత్వం సంపూర్ణంగా రద్దు చేయాలి

లోక్ రక్షక్ పార్టీ వ్యవస్థాపకులు కొండా చరణ్

చర్ల,2026నవంబర్ 10,సూర్యోదయవార్త న్యూస్ :

చర్ల మండల కేంద్రంలోని ఇంద్ర కీలాద్రి దుర్గామాత గుడి సమీపంలో లోక్ రక్షక్ పార్టీ,మహిళా రక్షణ సంఘం ఐక్య కార్యచరణలో భాగంగా అత్యవసర సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎల్ ఆర్ పి వ్యవస్థాపకులు కొండా చరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల ప్రాణాలను బలికొంటూ నిర్వహించ బడుతున్నటు వంటి ఇసుక ర్యాంపులను తక్షణమే సంపూర్ణంగా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలను ఆర్థికంగా ముందుకు తీసుకువచ్చేందుకు సొసైటీల నియమ నిబంధనల ద్వారా ఈ ఇసుక ర్యాంపుల నిర్వహణకు అనుమతి ఇచ్చారని కానీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వం ఆశించిన దానికి భిన్నంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ యంత్రాలతో రాత్రి పగలు తేడా లేకుండా లోతు వెడల్పులతో ఎటువంటి నియమ నిబంధనలను పాటించకుండా ఇసుక ర్యాంపులు నడుస్తున్నాయని తెలిపారు. అంతేకాకుండా ఒక శాతం ప్రజలకు లాభాలు చేకూర్చే దానికి తొంబైతోమ్మిది శాతం ప్రజలకు ఈ ప్రాంతంలో నష్టం జరుగుతుందని అన్నారు. ఇసుక ర్యాంపులతో ఏసంబంధం లేని రైతుల పంట పొలాలు ఇసుక లారీలు నిరంతరం రేపుతున్న



దుమ్ము దూలికి నాశనం అవుతున్నాయని, ఆ దుమ్ముదూళి కారణంగా ఇసుక ర్యాంపులకు ఏ సంబంధం లేని ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని కంటిచూపు,శ్వాసకోస తదితర అనారోగ్య సమస్యలు ప్రజలకు ఎదురవుతున్నాయని, ఇసుక ర్యాంపులకు ఏ సంబంధం లేని ప్రజలు అందరికి సంబంధించిన రోడ్డు సర్వనాశనం అయ్యిందని ఇసుక లారీల ధాటికి రోడ్డు గుంతలమయం అయిన కారణంగా ప్రజల ప్రయాణం ఎంతో కష్టతరం అయిందని తెలిపారు. ఆ గుంతలు పూడ్చడానికి మళ్లీ ప్రజలందరికీ సంబంధించిన డబ్బుని ప్రభుత్వం ఖర్చు పెట్టి ఆ గుంతలు పూడ్చే పని చేస్తుందని అన్నారు. ఇసుక ర్యాంపులతో ఏ సంబంధం లేని ప్రజలు యాక్సిడెంట్లకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారని ఆర్థికంగా నష్టపోతున్నారని అన్నారు. ఎటువంటి సంబంధంలేని ప్రజలు ఉద్యోగులు మరణిస్తున్నారని వారి కుటుంబాలు దిక్కులేని వారిగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పుణ్యజీవుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని తెలిపారు. ప్రశ్నించిన ప్రజలపై సొసైటీ సభ్యులు, లాభాలు పొందుతున్న వాళ్లు బెదిరింపులకు గురి చేస్తున్నారని విలేకరులపై దాడికి తెగబడుతున్నారని మండిపడ్డారు. ఈ ఇసుక ర్యాంపుల కారణంగా స్వతహాగనే ఐకమత్యంగా ఉండే ఆదివాసీలు గ్రూపులుగా మారి ఒకరిని ఒకరు దూషించుకోవడం, దాడులు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఒక ప్రక్కన ప్రాణాలు పోతుంటే ప్రభుత్వం లాభాల గురించి ఆలోచించడం సరికాదని స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఒక శాతం ప్రజల అభివృద్ధి కావాలో తొంబైతోమ్మిది శాతం మంది ప్రజలకు మంచి జరగడం కావాలనో నిర్ణయించుకోవాలని కొండా చరణ్ అన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రాణాల రక్షణ కోసం లోక్ రక్షక్ పార్టీ చేస్తున్న ఇసుక ర్యాంపుల సంపూర్ణ రద్దు ఉద్యమానికి ప్రజలందరూ మద్దతు ఇవ్వాలని ముక్తకంఠంతో ఇసుక ర్యాంపుల రద్దుకై గర్జించాలని కొండా చరణ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జాతీయ నాయకులు కొండా ప్రమోద్, పార్టీ చర్లమండల అధ్యక్షులు ఎస్.కె జహ్వూరుద్దీన్ భాషా,మహిళా సంఘం నాయకులు వెంకటలక్ష్మి,కే.స్వరూప, సంధ్య,రాధ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఆదివాసులనే నియమించాలీ..

- మంగపేట ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు డిమాండ్.

మంగపేట. ములుగు జిల్లా. నవంబర్ 10- (సూర్యోదయ వార్త.)

– ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంగపేట మండల జేఏసీ ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయనున్న ఎస్టీ కమిషన్ చైర్మన్‌తో పాటు సభ్యులుగా ఆదివాసులనే నియమించాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగంలోని ఐదవ, ఆరవ షెడ్యూల్ ద్వారా ఆదివాసులకు కల్పించిన హక్కులు, చట్టాలను పరిరక్షించాల్సిన బాధ్యత ఎస్టీ కమిషన్‌పై ఉందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లోని ఖనిజ సంపద, సహజ వనరులు,



భూములు, అడవులు, పోడు భూములపై ఆదివాసుల హక్కులను కాపాడాలని కోరారు. అర్హులైన ఆదివాసీ రైతులకు పోడు భూముల పట్టాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆదివాసుల ఎదుర్కొంటున్న పాలు సమస్యలు, హక్కులు, జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలపై పూర్తి అవగాహన కలిగిన ఆదివాసీ ప్రతినిధులకే ఎస్టీ కమిషన్‌లో ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేసేలా ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ ఆదివాసి ప్రాంతాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించి ఆదివాసి ప్రాంతాల అభివృద్ధి సమస్యలు పరిష్కరించాలని ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ కోరింది ఈ కార్యక్రమంలో ఆదివాసి ప్రజాసంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు ఎట్టి సారయ్య దొర, తోలేం సుధాకర్,కొరెం మొగిలి, తోలేం రామకృష్ణ, చందా రమేష్, సొలం వెంకటేశ్వర్లు, ఈసం కృష్ణ, జిగట శ్రీను, సోలం సాయిబాబు, సున్నం మధు, తోలేం వెంకన్న,పూనెం నరసయ్య, అనేబోయిన నరేందర్ తదితరులు పాల్గొన్నారు..

కనీస వసతులు లేని పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు.

కడపాక రాజశేఖర్ వర్మ.

మల్లంపల్లి. ములుగు జిల్లా. నవంబర్ 10 (సూర్యోదయ వార్త)

– ములుగు జిల్లా మల్లంపల్లి లోని వివేకానంద హైస్కూల్లో విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా . విద్యా హక్కు చట్టాన్ని పాటించడం లేదంటూ ఆరోపిస్తూ బహుజన్ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు కడపాక రాజశేఖర్ వర్మ మంగళవారం డీఈవోకు వీరినంత పత్రం అందజేశారు. పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాల పై విచారణ జరిపి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.



కుంజ సుమంత్ కుటుంబానికి అండగా మంత్రి సీతక్క..!

- దశదిన కర్మలకు ఆర్థిక సహాయం.
- ఆపద సమయంలో ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటాం.
- పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య.. మండల పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు..

మంగపేట ములుగు జిల్లా ,నవంబర్ 10: సూర్యదయ వార్త.

ములుగు జిల్లా మంగపేట మండలంలోని నిమ్మగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని చింతకుంట గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కుంజ రాంబాబు కుమారుడు క్రీస్తు శేషులు



కుంజ సుమంత్ ఇటీవల కాలంలో మరణించిన విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య,మంగపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపల్లి వెంకటేశ్వర్లు పార్టీ నాయకులతో కలిసి హాజరై కుంజ సుమంత్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రత్యేక చొరవతో దశదిన కర్మల నిర్వహణ నిమిత్తం బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం ద్వారా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు అయ్యోరి యానయ్య,మండల మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి,ములుగు మార్కెట్ కమిటీ సభ్యులు కొమురం బాలన్న,సీనియర్ నాయకులు కొమురం సారయ్య,శానం సత్యనారాయణ,గంగినేనీ శేషగిరి,మద్దెల ప్రవీణ్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతల పనుల ప్రారంభం..

కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించిన.

లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్.

మొగిలిపల్లి రవీందర్.

తాడ్వాయి. ములుగు జిల్లా. నవంబర్ 10 (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

– ములుగు జిల్లా ఎస్ ఎస్ తాడ్వాయి మండలం లింగాల గ్రామపంచాయితీ పరిధిలో మంగళవారం సర్పంచ్ మొగిలి పెల్లి రవీందర్ ఆధ్వర్యంలో కోడిశాల లో ఇంకుడు గుంతలు పరులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా లింగాల గ్రామపంచాయతీ సర్పంచ్. మొగిలిపల్లి రవీందర్ మాట్లాడుతూ. లింగాల గ్రామపంచాయతీ పరిధిలో ఇప్పటివరకు 25 ఇంకుడు గుంతల పనులను



ప్రారంభించామని . ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని భూగర్భ జలాల పెంపు కోసం ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా సర్పంచుగ్రామస్తులక సూచించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోడెమ్ రాజేష్ వార్డ్ మెంబర్లు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు.



మంగపేట, ములుగు జిల్లా .నవంబర్ 10 సూర్యోదయ వార్త.

ములుగు జిల్లా మంగపేట మండలం తిమ్మంపేటలో మంగళవారం ఉదయం ఎస్ఐ మధుకర్ ఆధ్వర్యంలో పోలీసులు గుడుంబా స్థావరాల పై దాడులు చేశారు.ఈ గుడుంబా స్థావరాల దాడులలో ఏటూరునాగారం సీఐ సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.ఈ దాడులలో గుడుంబా స్వాధీనం చేసుకొని బెల్లం పానకం ధ్వంసం చేశారు.అక్రమంగా గుడుంబా తయారు చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్ భవనం పై పెరుగుతున్న మర్రి మొక్కలు..



ఏటూరు నాగారం. ములుగు జిల్లా. నవంబరు 10 (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

ములుగు జిల్లా ఏటూరు నాగారం స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాల పై నాలుగు చోట్ల మర్రి మొక్కలు పెరుగుతున్నాయి. వాటి వేళ్ళు భవనంలోని గోడల్లోకి చొచ్చుకు పోవడంతో గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. మొక్కలను తొలగించ పోవడంతో భవనం పెచ్చులు ఊడిపడే ప్రమాదం ఉందని విద్యార్థులు. ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల వెంటనే స్పందించి మర్రి మొక్కలను తొలగించి భవనానికి మరమ్మత్తులు చేపట్టాలని కోరుతున్నారు..

సూర్యోదయ వార్త. ఎఫెక్ట్...!

డ్రైనేజీ సమస్యను పరిష్కరించిన గ్రామపంచాయతీ అధికారులు.



(సూర్యోదయ వార్త ములుగు జిల్లా ప్రతినిధి)

ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ముందు డ్రైనేజీ మురుగునీరు పేరుకుపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. బ్యాంకు పనుల నిమిత్తం వచ్చే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతూ ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పరిసరాల్లో అపరిశుభ్రతతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారులు. సిబ్బంది. వెంటనే స్పందించి. డ్రైనేజీ కాలువలు శుభ్రం చేసి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు..



ఏటూరు నాగారం. ములుగు జిల్లా. నవంబర్ 10 (సూర్యోదయ వార్త. ప్రతినిధి)

ములుగు జిల్లా ఏటూరు నాగారం మండల కేంద్రంలోని కెనరా బ్యాంకు ముందు డ్రైనేజీ దుర్వాసన వెదజల్లుతుందని సూర్యోదయ వార్త ద్వారా బ్యాంకు ముందు డ్రైనేజీ దుర్వాసన అనే శీర్షిక సోమవారం ప్రసరించిన విషయం తెలిసిందే గ్రామపంచాయతీ కార్యదర్శి జనార్ధన్ వెంటనే స్పందించారు. గ్రామపంచాయతీ సిబ్బందిని వెంటనే ఆ ప్రదేశానికి పంపించి డ్రైనేజీ కాలువను శుభ్రం చేసి సమస్యను పరిష్కరించినట్లు వెల్లడించారు...

గిరిజన విద్యార్థులకు ఐదు అంశాల్లో పోటీలు..

ఏటూరు నాగారం . నవంబర్ 10 (సూర్యోదయ వార్త. ప్రతినిధి)



ములుగు జిల్లా ఏటూరు నాగారం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏకే ఘు ణ పూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం గిరిజన విద్యార్థులకు 5 క్లబ్బుల ఆధ్వర్యంలో వ్యాసరచన ప్రజెంటేషన్ పోటీలు నిర్వహించారు. సాహిత్యం. సాంస్కృతి. క్రీడలు. పర్యావరణం. సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. వీరు ములుగు జిల్లా స్థాయి పోటీలో పాల్గొంటారు. అనంతరం ఆరు జిల్లాల స్థాయి లో ఐటిడిఏ పోటీలు నిర్వహించనున్నట్లు పిఓ తెలిపారు..

కంచె చేను మేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వమే భూములు అమ్ముతోంది

కూకట్‌పల్లి : కంచె చేను మేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రజా అవసరాలకు వదిలిన భూములను అమ్ముకుంటుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శించారు. హౌసింగ్ బోర్డు భూముల వేలానికి వ్యతిరేకంగా బీజేపీ ఆధ్వర్యంలో ఫోరం మాల్ ఎదురుగా హౌసింగ్ బోర్డు శాఖ వేలానికి పెట్టిన భూమిలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ కూకట్‌పల్లి మండలం సర్వే నంబర్ 1009లోని హౌసింగ్ బోర్డుకు చెందిన 2,696 గజాల భూమిని ప్రభుత్వం నిబంధనలను తుంగలో తొక్కి అమ్ముకానికి పెడుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. కూకట్‌పల్లి వంటి అత్యధిక జనాభా కలిగిన ప్రాంతంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కోసం భూములను కేటాయించాల్సింది పోయి, వాటిని అమ్ముకోవడం ఏమిటని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. హౌసింగ్ బోర్డు భూముల అమ్మకాలపై ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని గతంలోనే తాను ఎంపీగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. అదే విధంగా కూకట్‌పల్లిలో హుడా ట్రాక్ పార్కు 3 ఎకరాల భూమిని సైతం ప్రభుత్వం విక్రయించేందుకు ప్రయత్నిస్తోందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వేలం జరగకుండా అడ్డుకుంటామని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత తాను ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాక ఆక్రమణలకు గురైన లక్షల ఎకరాల భూములను కాపాడేందుకు పోరాడతానని చెప్పిన రేవంత్ రెడ్డి గొప్పలు చెప్పుకున్నారని ఆరోపించారు. భూములను కాపాడతానని చెప్పిన రేవంత్ రెడ్డి నేడు హౌసింగ్ బోర్డు భూములను ఎందుకు అమ్ముతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని ఘాటుగా వ్యాఖ్యానించారు.



ప్రభుత్వానికి భూములు ఇచ్చిన రైతులు ఎవరూ సంతోషంగా ఇవ్వరని, కూకట్‌పల్లి ట్రాక్ పార్కు ఉన్న స్థలాన్ని గత ఐదు దశాబ్దాల క్రితం రైతుల నుంచి సేకరించారని, హౌసింగ్ బోర్డు భూములను సైతం రైతుల నుంచి సేకరించినవేనని అన్నారు. రైతుల నుంచి సేకరించిన భూములను నేడు ప్రజల అవసరాలకు, ఆవాసాలకు వినియోగించాల్సింది పోయి రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా మారి రియల్ మాఫియాకు అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశాల్లో పేద ప్రజలకు ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని చెబుతున్నారు. మరి కూకట్‌పల్లి ప్రాంతంలోని భూములను పేదల ఇళ్ల నిర్మాణానికి ఎందుకు ఉపయోగించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం ఉన్నవారి కోసం ఆలోచిస్తోందా? లేనివారి కోసం ఆలోచిస్తోందా అని ప్రశ్నించారు.

నేడు పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలాలు లేక మొబైల్ ఫోన్లకు అతుక్కుపోయి బెడ్‌రూంలకు పరిమితం అవుతున్నారని, ఆట స్థలాలు ఉంటే చిన్నారులు బయటికి వచ్చి ఆడుకుని ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. కొందరు ఆటలు, క్రీడలకు దూరమై డ్రగ్స్, మద్యానికి బానిసలుగా మారుతున్నారని అన్నారు. పిల్లల దృష్టిని సానుకూల మార్గంలో మళ్లించేందుకు పార్కులు, ఆట స్థలాలు ఎంతో అవసరమని, అందుకోసం హౌసింగ్ బోర్డు భూములను ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని ఈటల రాజేందర్ సూచించారు.

ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలు వ్యతిరేకిస్తే, ప్రశ్నిస్తే వారిని ఇబ్బందులకు గురిచేయడం, కేసులు పెట్టి అరెస్టులు చేయడం వంటి చర్యలు రాష్ట్రంలో జరుగుతున్నాయని అన్నారు. పోలీసుల సమక్షంలోనే అరెస్టులు కొనసాగిస్తూ భూముల అమ్మకాలకు మార్గం సుగమం చేసుకుంటున్నారని విమర్శించారు. అధికారులు అక్రమార్కులతో చేతులు కలపకుండా ఉండాలని, నాయకుల అండదండలతోనే భూ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వం భూములు విక్రయించినప్పుడు తాను ప్రశ్నించలేదని, కూకట్‌పల్లి భూములు స్థానిక ప్రజలకు ఎంతో అవసరమైనవని, అందుకే వాటి అమ్మకాలను వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో భూములను సేకరించి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలకు నిజమైన ప్రయోజనం కలగడం లేదని ఆరోపించారు. 2028 తర్వాత ప్రజలే సీఎం రేవంత్ రెడ్డికి తగిన గుణపాఠం చెబుతారని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని అన్నారు.ఈ నెల 12వ తేదీన జరగనున్న హౌసింగ్ బోర్డు భూముల వేలాన్ని బీజేపీ, కేపీహెచ్‌బీ అన్ని ఫేజ్‌ల కాలనీవాసులతో కలిసి అడ్డుకుంటామని ఈటల రాజేందర్ హెచ్చరించారు. ప్రజా అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములను ప్రభుత్వం విక్రయించకుండా కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.సమావేశం అనంతరం బీజేపీ నాయకులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులతో కలిసి ఫోరం మాల్ ఎదురుగా ఉన్న కూడలిలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు, కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, యంజాల పద్మయ్య, ప్రీతమ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ మహేందర్, నర్వ పవన్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి : స్పీకర్

జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, త్వరలో జర్నలిస్టుల సమస్యలన్నీ పరిష్కారమవుతాయని తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) వికారాబాద్ జిల్లా తృతీయ మహాసభను నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. మహాసభలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఎండనకా, వాననకా, రాత్రనకా, పగలనకా జర్నలిస్టులు ప్రజల కోసం పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నారన్నారు. నిజాన్ని నిర్భయంగా ప్రజల ముందుకు తీసుకెళ్తున్నారని



పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని తెలిపారు. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం చాలా సానుకూలంగా ఉందన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలనే దృఢ సంకల్పంతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, వారి సమస్యలను తీర్చడానికి కృషి చేస్తున్నామని అన్నారు.ఇక్కడ చాలా మంది సీనియర్లు ఉన్నారని, 20 ఏళ్లకు పైగా పనిచేస్తున్న జర్నలిస్టు మిత్రులు ఉన్నారని తెలిపారు. తప్పకుండా వారికి అన్ని విధాలుగా అండగా ఉంటామని, వారి కష్టసుఖాల్లో తోడుగా ఎల్లప్పుడూ ఉంటామని అన్నారు. గత మూడేళ్లుగా ప్రజా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. మీడియా ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టే నాలుగో స్తంభం (ఫోర్త్ ఎస్టేట్) అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి, తెలంగాణ ఫైనాన్స్ కమిషన్ సభ్యులు రంగారాజు, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌హాజరయ్యారు.

బీఆర్ఎస్ పాలనలో పాలమూరుకు తీవ్ర అన్యాయం.. ఎమ్మెల్యే యెన్నం

గత బీఆర్ఎస్ పాలనలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కేసీఆర్ తీవ్ర అన్యాయం చేశారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పాలమూరు ప్రాంతానికి సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం జరిగిందని విమర్శించారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మూల వనరును జూరాల నుంచి శ్రీశైలం బ్యాక్‌వాటర్స్‌కు మార్చడం వల్ల పశ్చిమ మహబూబ్‌నగర్ ప్రాంతానికి నష్టం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని రూ.2 వేల కోట్లతో చేపట్టి లక్ష ఎకరాలకు సాగునీరు అందించేలా పనులు వేగవంతం చేసిందని తెలిపారు. ఉద్దండాపూర్ రిజర్వాయర్ భూసేకరణకు రూ.600 కోట్లు విడుదల చేశామని, సంఘంబండ రిజర్వాయర్ సమస్యలను పరిష్కరించామని పేర్కొన్నారు.కొడంగల్ ప్రాంతంలో 5 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని, భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.20 లక్షల పరిహారం అందిస్తున్నామని చెప్పారు. ఎల్‌అండ్‌టీ, బిర్లా వంటి సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నాయని వెల్లడించారు. రూ.5 వేల కోట్లతో ఎనిమిది వరుసల ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. నారాయణపేట–కొడంగల్ ప్రాంతంలో 250 ఎకరాల్లో మెడికల్, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, పాలిటెక్నిక్ కళాశాలలతో ఎడ్యుకేషన్ హబ్ నిర్మిస్తున్నామని వివరించారు. మరోవైపు కల్యాణలక్ష్మి, రైతు భరోసా, సీఎంఆర్ఎఫ్ వంటి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు ప్రభుత్వం అండగా ఉంటోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి వేల కోట్ల రూపాయల పనులకు శ్రీకారం చుట్టారని యెన్నం తెలిపారు. పాలమూరు అభివృద్ధి, రైతులకు సాగునీరు, యువతకు ఉపాధి కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

రామప్ప ఐలాండ్ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి..

ములుగు జిల్లా టూరిజం నోడల్ అధికారి. డా. ఏ ధర్మానాయక్..

వెంకటాపూర్. ములుగు జిల్లా. నవంబర్ 10 (సూర్యదయ వార్త. ప్రతినిధి)



ములుగు జిల్లా వెంకటాపూర్ మండల కేంద్రంలోని పాలంపేట రామప్ప సరస్సులోనే ఐలాండ్ లో చేపడుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని ములుగు జిల్లా టూరిజం నోడల్ అధికారి డా. ఏ ధర్మానాయక్ ఐలాండ్లో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి. నాణ్యత ప్రామాణాలను తనిఖీ చేశారు. పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేసి. నిర్దేశిత గడవలోగా అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

రైతులు మద్దతు ధరకు ధాన్యం విక్రయించాలి: ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని, రైతులు బయట మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయించి నష్టపోవద్దని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సూచించారు. మంగళవారం చిట్యాల పట్టణంలో ఏర్పాటు చేసిన ఎఫ్‌పీఓ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రాష్ట్రంలో నీటి ఎద్దడిని అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. మూసీ జలాలతో గుండ్రాంపల్లి, నుంకనపల్లి, పెద్దకాపర్తి, వెలిమినేడు, ఉరుమడ్ల గ్రామాల చెరువులను నింపుతున్నామన్నారు. బ్రాహ్మణ వెల్లంల, ఉదయ సముద్రం ప్రాజెక్టుల ద్వారా నేరడ, నార్మెట్‌పల్లి చెరువులకు నీటిని అందించే ప్రయత్నం చేస్తున్నామని, ధర్మారెడ్డి కాలువ పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామని వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీత రమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్ర వినోద మోహన్ రెడ్డి, కౌన్సిలర్లు కుక్కల మోహన్, ఏర్పుల పరమేష్, దేశపాక లతా రాజేష్, కనకదుర్గ ఆలయ చైర్మన్ మార్గోని ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జడల చిన్న మల్లయ్య, పట్టణ అధ్యక్షుడు ఎద్దులపూరి కృష్ణ స్థానిక నాయకులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ఇండస్ట్రీలోకి రాకముందే ముక్కుకు సర్జరీ చేయించుకున్నా.. ఆసక్తికర విషయాలు బయటపెట్టిన జాన్వీ కపూర్!



బాలీవుడ్ అందాల తార, దివంగత నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ తన సినీ ప్రయాణానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను బయటపెట్టారు. సినిమాల్లోకి రావడానికి ముందు తన తల్లి శ్రీదేవి పెట్టిన కండిషన్లు, ఆమె ఇచ్చిన సలహాల గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. అంతేకాదు.. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడానికి ముందే తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు కూడా చెప్పుకొచ్చారు. తొలుత తాను సినిమాల్లోకి వస్తానంటే తల్లి శ్రీదేవి పెద్దగా ఆసక్తి చూపించలేదని, అయితే ఆ తర్వాత తన నిర్ణయానికి మద్దతు ఇచ్చిందని తెలిపారు. ప్రస్తుతం జాన్వీ చేసిన ఈ వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. జాన్వీ కపూర్ తన తల్లి శ్రీదేవితో ఉన్న అనుబంధం గురించి ఎప్పటికప్పుడు పలు సందర్భాల్లో మాట్లాడుతూనే ఉంటారు. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో కూడా తన కెరీర్‌కు సంబంధించి తల్లి ఇచ్చిన సలహాలను గుర్తు చేసుకున్నారు. తాను సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు ఆ విషయాన్ని మొదట శ్రీదేవికి చెప్పానని, అయితే ఆమె వెంటనే అంగీకరించలేదని తెలిపారు. సినిమా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టడం అంటే సాధారణ విషయం కాదని, ఈ రంగంలోకి వస్తే జీవితాంతం నటనకే అంకితం కావాల్సి ఉంటుందని తన తల్లి చెప్పినట్లు వెల్లడించారు. ఈ వృత్తిలో ఎన్నో సవాళ్లు ఎదురవుతాయని, పూర్తి నిబద్ధతతో పనిచేయాల్సి ఉంటుందని శ్రీదేవి తనకు వివరించినట్లు చెప్పారు. మొదట్లో తనపై తల్లికి అంతగా నమ్మకం ఉండేది కాదని కూడా జాన్వీ పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలో జాన్వీ చెప్పిన మరో విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సినిమాల్లోకి రావడానికి ముందు తన ముక్కుకు సర్జరీ చేయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. తన తల్లి సూచన మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఆ తర్వాతే తనలో నటిగా కొనసాగగల లక్షణాలు ఉన్నాయని శ్రీదేవి భావించినట్లు చెప్పుకొచ్చారు. అయితే జాన్వీ వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె అందం, సినీ రంగ ప్రవేశానికి ముందు చేసిన మార్పుల గురించి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ఇప్పటికే పలుమార్లు తన వ్యక్తిగత రూపం, అందం గురించి జాన్వీ బహిరంగంగా మాట్లాడారు. అందం విషయంలో ఇతరులతో పోల్చుకోవడం సరికాదని, సోషల్ మీడియాలో కనిపించే అందమైన చిత్రాలను చూసి యువతులు తమను తాము తక్కువగా భావించుకోవద్దని సూచించారు.తన వ్యక్తిత్వం, అందం, కెరీర్‌కు సంబంధించిన ఎన్నో విషయాల్లో తల్లి ప్రభావం ఉందని జాన్వీ గతంలోనూ వెల్లడించారు.

బ్లాక్ అవుట్‌ఫిట్‌లో బ్యూటీ క్వీన్ త్రిప్తి దిమ్రి అందాల విందు





ఓటీటీలోకి వస్తున్న ‘గరివిడి లక్ష్మి’.. ఆనంది నటించిన బయోపిక్ ఎక్కడ చూడొచ్చంటే?

1980, 90వ దశకాల్లో తన జానపద పాటలు, బుర్రకథలు, కథాగానంతో ఉత్తరాంధ్ర ప్రజలను అలరించిన ప్రముఖ జానపద కళాకారిణి గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం ‘గరివిడి లక్ష్మి’. టాలీవుడ్ నటి ఆనంది టైటిల్ రోల్‌లో నటించిన ఈ సినిమా అక్టోబర్ 17న థియేటర్లలో విడుదలై ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. త్వరలోనే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. తాజా సమాచారం ప్రకారం ‘గరివిడి లక్ష్మి’ సినిమా నవంబర్ 13, శుక్రవారం నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఓటీటీ విడుదల తేదీ, స్ట్రీమింగ్‌కు సంబంధించిన వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన వెలువడితే సినిమా డిజిటల్ రిలీజ్‌పై మరింత స్పష్టత రానుంది. ఉత్తరాంధ్రలోని విజయనగరం జిల్లా గరివిడి గ్రామానికి చెందిన జానపద కళాకారిణి లక్ష్మి జీవితంలోని సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని రూపొందించారు. చిన్న వయసులోనే వివాహం చేసుకున్న లక్ష్మి, భర్తకు అప్పటికే మరో పెళ్లి జరిగిందని తెలుసుకుని జీవితంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ పరిస్థితుల్లో ఆమె తల్లి దేవుడమ్మ తన కూతురికి అండగా నిలుస్తుంది. ఆ తర్వాత లక్ష్మికి బుర్రకథలు, జానపద పాటలపై ఆసక్తి పెరుగుతుంది. సత్తిబాబు పరిచయంతో అతడితో కలిసి ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభిస్తుంది. తన గాత్రంతో, కథాగానంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ క్రమంగా మంచి గుర్తింపు తెచ్చుకుంటుంది. అయితే ఆమె జీవితంలో పేరు ప్రఖ్యాతులతో పాటు అనేక చేదు అనుభవాలు కూడా ఎదురవుతాయి. లక్ష్మి జీవితంలో సత్తిబాబు పాత్ర ఎలాంటి మలుపులు తీసుకొచ్చింది? ప్రేమ పేరుతో అతడు ఆమెను ఎలా మోసం చేశాడు? ఆమె పాడిన పాటలు, సంపాదించుకున్న గుర్తింపును ఇతరులు ఎలా సొంతం చేసుకున్నారు? కళాకారిణిగా ఎదిగిన లక్ష్మి వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు ఏమిటి? అనే అంశాలను ఈ సినిమాలో చూపించారు.అంతేకాదు, లక్ష్మికి తిరిగి గుర్తింపు తీసుకురావడానికి రాంబాబు చేసిన ప్రయత్నాలు, ఆమె జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు కథలో కీలకంగా నిలుస్తాయి. ఒక జానపద కళాకారిణి ప్రయాణం, ఆమె పోరాటం, కళకు దక్కాల్సిన గౌరవం వంటి అంశాలను ఈ చిత్రం తెరపై ఆవిష్కరించింది. ఈ సినిమాలో ఆనంది గరివిడి లక్ష్మిగా ప్రధాన పాత్ర పోషించగా, సీనియర్ నటి రాశి ఆమె తల్లి దేవుడమ్మ పాత్రలో కనిపించారు. వీకే నరేశ్, రాగ్ మయూర్, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్, కంచరపాలెం కిషోర్, కుశాలిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

సూపర్ న్యాచురల్ హార్రర్ థ్రిల్లర్ ‘డెమోంటే కాలనీ 3’ ఆన్ ది వే



। తెలుగులో రిలీజై మంచి టాక్ తెచ్చుకున్న తమిళ ఫ్రాంచైజీల్లో ఒకటి ‘డెమోంటే కాలనీ ’ ఆర్ అజయ్ జ్ఞానముత్తు రచన, దర్శకత్వంలో ఇప్పటికే డెమోంటే కాలనీ 2 కూడా వచ్చిందని తెలిసిందే. ఇప్పుడిక థర్డ్ పార్ట్ టైం వచ్చేసింది. సూపర్ న్యాచురల్ హార్రర్ థ్రిల్లర్‌గా రాబోతున్న డెమోంటే కాలనీ 3 విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చేశారు మేకర్స్. ఈ మూవీలో ప్రియా భవానీ శంకర్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. అరుల్ నిధి లీడ్ రోల్ పోషిస్తున్నాడు. ఈ మూవీ పలు వాయిదాల తర్వాత ఫైనల్‌గా 2027 పొంగళ్ కానుకగా థియేటర్లలో సందడి చేయనుంది. థర్డ్ పార్ట్‌లో అర్జునా రవిచంద్రన్ మీనాక్షి గోవింద రాజన్‌తోపాటు ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషించారు. శ్యామ్ సీఎస్ మ్యూజిక్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఈ మూవీ ప్రమోషన్స్ త్వరలోనే షురూ కానున్నాయి. 2015లో చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద గ్రాండ్ సక్సెస్ అందుకుంది డెమోంటే కాలనీ. మళ్లీ 8 ఏండ్ల తర్వాత వచ్చిన సీక్వెల్ పార్ట్‌లో అరుణ్‌పాండియన్, ముత్తుకుమార్, మీనాక్షి గోవిందరాజన్, అర్చన రవిచంద్రన్ తదితరులు కీలక పాత్రల్లో నటించారు.